సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం | 24 | మే | 2025



మెస్ టెండర్లపై మౌనం
నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. టెండర్లు పిలవకుండా కాలక్షేపం చేస్తున్నారు.
10లో ▸



పచ్చిరొట్టతో భూమికి సారం
పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు కొరతతో రైతులు పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై దృష్టి సారిస్తున్నారు.
10లో ▸



వైభవంగా గరుడోత్సవం
జంగారెడ్డిగూడెం గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.
10లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఈఏపీసెట్



భీమవరంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలోని ఐదు కేంద్రాల్లో ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్‌లో ఉదయం 170 మందికి 166 మంది, మధ్యాహ్నం 170 మందికి 164 మంది హాజరయ్యారు. విష్ణు ఇంజనీరింగ్‌లో ఉదయం 107 మందికి 104 మంది, మధ్యాహ్నం 107 మందికి 104 మంది హాజరయ్యారు. విష్ణు ఉమెన్స్ కళాశాలలో ఉదయం 86 మందికి 85 మంది, మధ్యాహ్నం 87 మందికి 86 మంది హాజరయ్యారు. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో ఉదయం 101 మందికి 101 మంది, మధ్యాహ్నం 101 మందికి 99 మంది, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 100 మందికి 93 మంది, మధ్యాహ్నం 100 మందికి 95 మంది విద్యార్థులు హాజరయ్యారు.

తాడేపల్లిగూడెంలో..
తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు 449 మందికి 435 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రత్నాకరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టెన్త్ సప్లిమెంటరీకి 71 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు శుక్రవారం 71 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. 3,037 మంది విద్యార్థులకు 876 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే ఎస్ఎస్‌సీ (ఏపీఓఎస్ఎస్) పరీక్షకు 299 మందికి 219 మంది, ఇంటర్ (ఏపీఓఎస్ఎస్) పరీక్షకు 376 మందికి 324 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ చెప్పారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలి



మంత్రి నిమ్మలకు వినతిపత్రం ఇస్తున్న వర్కర్లు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించలేక అవస్థలు పడుతున్నారని, జీతాలు పెంచాలంటూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు పాలకొల్లు పురపాలక సంఘ వాటర్ సప్లయ్ వర్కర్స్ వినతి పత్రం అందజేశారు. ఔట్ సోర్సింగ్ లో పదేళ్లుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ లేదా కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలన్నారు. నాన్ పీహెచ్ (వాటర్ సప్లయ్ వర్కర్స్)కు వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ కల్పించాలని, ఔట్ సోర్సింగ్ వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్‌లో సుమారు 3 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు.

ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీ వర్షాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం వేకువ జామున పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. తాడేపల్లిగూడెం, పెంటపాడు, భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదాపు మూడు దుక్కుల వర్షం కురిసిందని, ఇటీవల కాలంలో ఇంత భారీ వర్షం కురియలేదని స్థానికులు తెలిపారు. తాడేపల్లిగూడెంలో 19.8 మి.మీ, పెంటపాడులో 28.2 మి.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

కోవిడ్‌పై అప్రమత్తం



డాక్టర్ సుందర్ కుమార్

దెందులూరు: కోవిడ్ బారిన పడకుండా ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని దెందులూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ కోవిడ్ నివారణకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ప్రార్థనా, సామాజిక సమావేశాలు, పార్టీలు వంటివి వాయిదా వేసుకోవాలని, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల వద్ద కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎక్కువ జనాభా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా వాడాలని, చలి జ్వరం, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ తీగలు.. యమపాశాలు

ఆదమరిస్తే అంతే!
- ఆక్వా చెరువుల వద్ద అస్తవ్యస్తంగా విద్యుత్ వ్యవస్థ
- నిర్లక్ష్యంగా విద్యుత్ తీగల ఏర్పాటు
- విద్యుదాఘాతాలతో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- వర్షాకాలంలో సమస్య మరింత జటిలం
- రెండు రోజుల క్రితం ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు



ఉండి నియోజకవర్గంలో చెరువుల వద్ద రోడ్డు, చెరువు గట్టుపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఉండి మండలం వెలివర్రులోని ఆక్వా చెరువుల వద్ద బుధవారం బోదెలో చేపలు పట్టేందుకు దిగిన యువకుడు పక్కనే విద్యుత్ స్తంభం నుంచి వేలాడుతున్న వైరు తగిలి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. అదే రోజున ఏలూరు రూరల్ లింగారావు గూడెం చెరువు వద్ద విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. రొయ్యలు, చేపలకు ఆక్సిజన్ అందించేందుకు ఆక్వా చెరువుల వద్ద విద్యుత్ వైర్లు ఏర్పాటులో అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యం అమాయకుల ఉసురు తీస్తోంది. వర్షాకాలంలో అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది.

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.63 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఏరియేటర్లు ద్వారా చెరువుల్లోని చేపలు, రొయ్యలకు నిరంతరంగా ఆక్సిజన్ సరఫరా చేసేందుకు త్రీఫేస్ విద్యుత్‌ను వినియోగిస్తారు. చెరువు చుట్టూ ఉండే ఈ వైర్లను అందరికీ కనిపించేలా కర్రలకు కట్టాలి. ఏరియేటర్ కనెక్షన్ వద్ద టేపు ఎక్కువగా వేయాలి. చెరువుల చుట్టూ ఉండే వైర్లకు ఎక్కువగా జాయింట్లు లేకుండా చూసుకోవాలి. వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ కాలం చెల్లిన వాటిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటుచేయాలి. ఎలక్ట్రీషియన్‌ను ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి. అయితే ఇలాంటి జాగ్రత్తలేమీ తీసుకోవడం లేదు.

ఎలాపడితే అలా వైర్లు..
రెండు ఎకరాల నుంచి వంద ఎకరాలకు పైగా ఆక్వా సాగు చేస్తుంటారు. సాగు విస్తీర్ణం పెరిగే కొద్దీ వైర్లు ఎలా పడితే అలా లాగేస్తున్నారు. కొందరు ప్రభుత్వ స్థలాలు, రహదారులు, కాలువ గట్లపై జాగ్రత్తలు పాటించకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. వైర్లను కొబ్బరి చెట్లకు వేలాడదీయడం, రోడ్డుపైన, చెరువు గట్లపై నుంచి లాగేస్తున్నారు. కొంతకాలానికి మట్టి, గడ్డి కప్పేయడంతో అవి కనిపించని పరిస్థితి. కొత్తగా వచ్చిన కూలీలకు గట్టుపై ఉన్న వైర్లలో జాయింట్లు ఎక్కడ ఉన్నాయో తెలియక షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏరియేటర్లు, మెటార్లు మొరాయిస్తుంటాయి. ఎలక్ట్రీషియన్ అందుబాటులో లేక కూలీలే మరమ్మతులు చేసే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఎందరో..
జిల్లావ్యాప్తంగా ఏటా చెరువుల వద్ద ఎందరో విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండగా వారి కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. కొన్ని కేసులు వరకు వస్తే మరికొన్ని గుట్టుచప్పుడు కాకుండా సర్దుబాటు చేస్తున్నారు. చెరువుల వద్ద పనిచేసే వారిలో ఒడిసా, పశ్చిమ బెంగాళ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే ఎక్కువ. స్థానిక పరిస్థితులపై అవగాహన లేక ప్రమాదాలు బారిన పడే వారిలో వారే అధికంగా ఉంటున్నారు. చెరువుల వద్ద విద్యుత్ వ్యవసపై తనిఖీలు చేసేందుకు విద్యుత్‌శాఖ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా ట్రాన్స్‌ఫార్మర్లు వరకే తమకు బాధ్యత అనే ధోరణిలో విద్యుత్ అధికారులు ఉంటున్నారు.

మృత్యు ఘంటికలు
- గతంలో భీమవరం రూరల్ గొల్లవాని తిప్పలో ఒక రైతు తమ చెరువులో మేత వేసేందుకు వెళుతుండగా హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలి ప్రాణాలు కోల్పోయాడు.
- గూట్లపాడు రేవులో రొయ్యల చెరువు వద్ద విద్యుత్ వైరు తగిలి మరో రైతు మృతి చెందాడు.
- తాడేరులో రొయ్యల చెరువు వద్ద గట్టుపై గడ్డి కోస్తుండగా కొడవలికి విద్యుత్ వైరు తగిలి కూలీ కన్నుమూశాడు.
- దొంగపిండిలో చెరువు వద్ద పనిచేసే వ్యక్తి చెరువులో ఏరియేటర్‌ను రిపేరు చేసేందుకు దిగి మృత్యువాత పడ్డాడు.



నేలపై తెగిపడిన విద్యుత్ వైర్లు

అప్రమత్తత అవసరం
- వర్షాకాలం దృష్ట్యా ఇళ్ల వద్ద కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.
- భారీ వర్షాలు, గాలులు వీచే సమయంలో విద్యుత్ లైన్ల కింద నిల్చోకూడదు. ఇంటి గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ చేసుకోవాలి.
- తడి చేతులతో స్విచ్ఛ్‌లను ఆన్, ఆఫ్ చేయకూడదు.
- చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు వెళ్లనివ్వకూడదు.
- ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్లు కట్ అయినా వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో వాటిని తాకకూడదు.
- వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను తాకరాదు.
- చెట్లు, విద్యుత్ స్తంభాలు పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ సిబ్బంది లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలి.
- మోటార్లు తడిసి షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉన్నందున రైతులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలి.

ఎండీయూ వాహనాల రద్దుపై మండిపాటు

భీమవరం: ప్రభుత్వం ప్రజలకు నిత్యావసర సరుకులను ఎండీయూ వాహనాల ద్వారానే సరఫరా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని 38వ వార్డు లంకపేటలో ఎండీయూ వ్యవస్థ రద్దును ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ రేషన్ వాహనాల ద్వారా అవినీతి జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోల వద్దే రేషన్ తెచ్చుకోవాలనడం అన్యాయమన్నారు. పట్టణ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని, సన్న బియ్యంతో పాటు కందిపప్పు, చింతపండు, నూనె, పంచదార వంటి నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, కుమారి సాయమ్మ, రమేష్, మరియమ్మ పాల్గొన్నారు.



భీమవరంలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

వాహనాల తొలగింపు దారుణం
భీమవరం అర్బన్: రేషన్ వాహనాల నిలిపివేత నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుని ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత మెరుగు పరచాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని వెంప గ్రామంలో పెదపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. గతంలో ప్రజలు మానుకుని రేషన్ దుకాణాలకు వెళ్లి క్యూలైన్‌లో రేషన్ తీసుకునే వారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ప్రజల ఇబ్బందుల దృష్ట్యా రేషన్ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు సరఫరా చేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రేషన్ వాహనాలు తొలగించడం దారుణమన్నారు.

● నాన్‌స్టాప్ సర్వీసు.. ఆర్డినరీ బస్సు



నూజివీడు-విజయవాడ మధ్య నాన్‌స్టాప్ సర్వీసుకు పల్లె వెలుగు బస్సులను నడపటంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.65 చార్జీ వసూలు చేస్తూ పల్లె వెలుగు బస్సు నడపమేంటని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం నూజివీడు డిపో వద్ద నాన్‌స్టాప్ సర్వీసుకు పల్లె వెలుగు బస్సును ఏర్పాటు చేసిన దృశ్యమిది.
- నూజివీడు

ఉపాధ్యాయుల బదిలీలపై అవగాహన



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని యూటీఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీలు, సర్దుబాట్లపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు పాల్గొని బదిలీల జీఓలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల సందేహాలు, సమస్యలపై పరిష్కారాలు తెలిపారు. కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. హెల్ప్‌డెస్క్‌లో ఉపాధ్యాయులతో ఆన్‌లైన్ దరఖాస్తులు చేయించడంలో జిల్లా సాంకేతిక బృందం పనిచేస్తుందని నాయకులు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ మాట్లాడుతూ ప్రధాన నాయకులు జిల్లా కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయుల సమస్యలను డీఈఓ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో సమస్యలపై రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళుతున్నామన్నారు. బదిలీల ప్రక్రియ పూర్తయ్యే వరకూ హెల్ప్‌డెస్క్ కొనసాగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్, జిల్లా కార్యదర్శులు నంబూరి రాంబాబు, జి.అంజన, కె.కమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్లాట్.. ఫీట్

- మందకొడిగా రిజిస్ట్రేషన్లు
- సమయానికి రాకుంటే అదనపు ఫీజు వసూలు
- సర్వర్ మొరాయిస్తే పడిగాపులు
- రిజిస్ట్రేషన్ స్లాట్ విధానంతో అవస్థలు



ఏలూరులో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ విధానం ప్రజలకు సర్కస్ ఫీట్‌ను తలపిస్తోంది. అనివార్య కారణాల వల్ల స్లాట్ సమయానికి రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతే, స్లాట్‌ను రీ షెడ్యూల్ చేయించుకునేందుకు అదనంగా ఫీజు చెల్లించాల్సి వస్తోంది. దీంతో స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు పడుతున్నామని పలువురు అంటున్నారు. స్లాట్‌ను మొదటిసారి రీ షెడ్యూల్ చేసుకుంటే రూ.200, రెండోసారి రీ షెడ్యూల్ చేసుకుంటే రూ.500 చెల్లించాల్సి రావడంతో జేబులు గుల్ల అవుతున్నాయని లబోదిబోమంటున్నారు. గతంలో తాము అనుకున్న రోజున ఏదో ఒక సమయానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకుని వెళ్లేవారమని, ఇప్పుడు స్లాట్ బుకింగ్ సమయానికి రాకపోతే ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

సర్వర్లు పనిచేయకపోతే..
రిజిస్ట్రేషన్ శాఖలో తరచూ ఎదురయ్యే ఇబ్బందుల్లో సర్వర్లు మొరాయించడం పెద్ద సమస్య. పాత విధానంలో సర్వర్లు పనిచేయకపోతే మరో రోజు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు ఉండేది. అయితే స్లాట్ విధానంలో ఆ వెసులుబాటు లేదు. సర్వర్లు పనిచేసే వరకూ కార్యాలయంలోనే వేచి ఉండాల్సి వస్తోంది. కార్యాలయ పనివేళలు ముగిసినా సర్వర్లు మొరాయించి స్లాట్ సమయంలోపు రిజిస్ట్రేషన్ పూర్తికాకపోతే సాయంత్రం 5.30 గంటల తర్వాత నిలిచిపోయిన స్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తోంది. ఇది అటు ప్రజలకు, ఇటు రిజిస్ట్రేషన్ సిబ్బందికి తలనొప్పిగా మారింది.

ఇబ్బందులుంటే పనివేళలు ముగిసిన తర్వాతే..



స్లాట్ విధానంలో ఆ సమయానికి సర్వర్ ఇబ్బందులెదురైతే కార్యాలయం పనివేళలు ముగిసిన తర్వాతే (సాయంత్రం 5.30 గంటలు) రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి ఈ విధానంలో రిజిస్ట్రేషన్లు బాగానే జరుగుతున్నాయి. జిల్లాలో స్లాట్ సమయం ముగిసి నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల వివరాలు ఆయా సబ్ రిజిస్ట్రార్ల వద్దనే ఉంటాయి.
– కె.శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా రిజిస్ట్రార్

ఒకటికి రెండు సార్లు తిరుగుతూ..
స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్లకు ఖర్చు పెరుగుతోంది. స్లాట్ సమయానికి రాకుంటే అదనపు ఫీజు చెల్లింపుతో పాటు ఒకటికి రెండు సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగేందుకు ప్రయాణ, అల్పాహార, భోజన ఖర్చులు పెరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు.

అనుకున్న స్థాయిలో రిజిస్ట్రేషన్లు లేవు
స్లాట్ విధానంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా నడుస్తున్నాయి. గతంలో రోజుకు కనీసం 80 నుంచి 90 వరకు, మంచి రోజులైతే 120 వరకూ రిజిస్ట్రేషన్లు జరిగేవి. అయితే స్లాట్ బుకింగ్ విధానం మొదలైనప్పటి నుంచి జిల్లాలో అనుకున్న స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఈ విధానం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకూ ఏలూరు జిల్లా పరిధిలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 3,599 మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. కార్యాలయాల వారీగా భీమడోలులో 366, చింతలపూడిలో 463, జంగారెడ్డిగూడెంలో 319, కామవరపుకోటలో 83, పోలవరంలో 127, ఏలూరులో 561, గణపవరంలో 110, వట్లూరులో 227, కైకలూరులో 61, మండవల్లిలో 89, ముదినేపల్లిలో 142, నూజివీడులో 1,051 రిజిస్ట్రేషన్లు పూర్తిచేశారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతన వెతలు

తణుకు అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల 4 నెలల వేతన బకాయిలు, 36 నెలల పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో 50 మందికి తగ్గకుండా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని ఏపీ మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్‌చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.కృపావరానికి అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ కార్మికులు అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, అవి కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పీఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదని విమర్శించారు. ఆస్పత్రిలో 150 పడకల స్థాయికి అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించి పనిభారం తగ్గించాలని కోరారు. సంఘ నాయకులు ధర్మాని పుష్పలత, నేకూరి లక్ష్మి, పి.విజయలక్ష్మి, ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జ్యూయలరీ షాపుల్లో తనిఖీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబు ఆదేశాల మేరకు శుక్రవారం విజిలెన్స్, జీఎస్‌టీ, తూనికలు–కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా బంగారం, వెండి దుకాణాల్లో తనిఖీలు చేశారు. నగరంలోని సరస్వతి సిల్వర్ ప్యాలెస్, శుభం జ్యూయలరీ షాపుల్లో తనిఖీ చేయగా.. సరస్వతి సిల్వర్ ప్యాలెస్‌లో 160 గ్రాముల బంగారం, 5,400 గ్రాముల వెండి స్టాక్ రిజిస్టర్ కన్నా ఎక్కువగా ఉన్నట్టు గుర్తించి జీఎస్‌టీ అధికారులు రూ.1,15,468 అపరాధ రుసుం విధించారు. అలాగే సరస్వతి సిల్వర్ ప్యాలెస్‌లో ఎటువంటి ధ్రువీకరణ లేని రెండు ఎలక్ట్రానిక్ కాటాలు గుర్తించి తూనికలు కొలతల శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ, ఎస్సై కె.సీతారాము, తహసీల్దార్ బి.కన్యాకుమారి, తూనికలు, కొలతల శాఖ అధికారి ఈశ్వరరామ్, జీఎస్‌టీ అధికారి వినోదరావు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

రేషనలైజేషన్‌లో లోపాలతో గందరగోళం

భీమవరం (ప్రకాశంచౌక్): రెవెన్యూ గ్రామాల రేషనలైజేషన్‌లో లోపాలు ఉన్నాయని, దీంతో గందరగోళ పరిస్థితి నెలకొందని గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోల) సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి వీఆర్వోలతో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్రకు మద్దతు తెలిపారు. అనంతరం రవీంద్రరాజు మీడియాతో మాట్లాడుతూ వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లను క్లస్టర్ విధానంలో రేషనలైజేషన్ చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. అయితే రెండు, మూడు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తే వీఆర్వోలపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. క్లస్టర్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,500 మంది వీఆర్వోలు, 4,722 మంది విలేజ్ సర్వేయర్లను తగ్గిస్తూ ఏ సచివాలయానికి కేటాయించారో చెప్పలేదన్నారు. ప్రభుత్వం భూ హక్కు సర్వేను 100 రోజులు లేదా 60 రోజుల్లోనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్న నేపథ్యంలో రెండు మూడు గ్రామాలకు ఒక వీఆర్వో ఉంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇప్పటికే రేషనలైజేషన్ ప్రక్రియలో లోపాలను రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీ నారాయణ, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ గుమ్మల జక్రయ్య, నాయకులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

క్లుప్తంగా

వైభవంగా గరుడోత్సవం



గ్రామోత్సవంలో స్వామి

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో 5వ రోజు గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం యాగశాలలో బ్రహ్మోత్సవ విశేష హోమాన్ని నిర్వహించి ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో విశేష బలిహరణ సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు గరుడ వాహనంపై విశేషంగా అలంకరించిన ప్రత్యేక వాహనంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి గరుడోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో కేరళ వాద్యాలు, కోలాలాలు, గోవింద నామస్మరణలు, మంగళ వాద్యాలతో, జంగారెడ్డిగూడెం పట్టణ వీధులలో వెంకటేశ్వర స్వామికి తిరువీధి సేవ నిర్వహించారు. గ్రామోత్సవంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతి రాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జికి తాడుతో 55 ఏళ్ల ఉన్న వ్యక్తి ఉరి వేసుకున్నాడు. శుక్రవారం ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడిని భిక్షగాడిగా చెబుతున్నారు. నాలుగైదు రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

తాపీ పనికి వచ్చి బంగారం చోరీ

జంగారెడ్డిగూడెం: తాపీ పని చేయడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఇంటి యజమానురాలి కళ్లల్లో కారం కొట్టి బంగారు తాడు, మంగళ సూత్రాలు దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అయ్యన్నకాలనీకి చెందిన మునగల జానకీ దేవి, ఆమె భర్త శ్రీరామశాస్త్రి ప్రభుత్వ టీచర్లుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఇల్లు రిపేరు నిమిత్తం తాపీ పనివారిని పెట్టుకున్నారు. శుక్రవారం తాపీ పనిచేయడానికి వచ్చిన చింతపల్లి అంజిబాబు, నక్కా శ్రీను అలియాస్ పండు, యడ్లపల్లి విజయరాజులు పని ప్రారంభించారు. జానకిదేవి భర్త శ్రీరామశాస్త్రి టిఫిన్ తెచ్చేందుకు బయటకు వెళ్లాడు. ఇదే అదునుగా జానకిదేవి కంట్లో కారం కొట్టి 4 కాసుల బంగారు నానుతాడు, మంగళసూత్రాలతో సహా దోచుకుపోయారు. జానకి దేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కైకలూరు: అనారోగ్యంతో ఉన్న తల్లిని ద్విచక్ర వాహంపై ఎక్కించుకుని కుమారుడు వస్తుండగా వరహాపట్నం వద్ద కింద పడడంతో ఆమెను చికిత్స కోసం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మరణించింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వరహాపట్నం గ్రామానికి చెందిన బోయిన రంగమ్మ(60) కుమారుడి బైక్ నుంచి కింద పడింది. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మెస్ టెండర్లపై మౌనం

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో అధికారుల నిర్లిప్తత
- 8 నెలలు గడిచినా టెండర్ల ఊసే లేదు



నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణను గాలికొదిలేశారు. నిర్వహణకు టెండర్లు పిలిచి కొత్త కేటరర్స్‌ను ఎంపిక చేసి లోటుపాట్లు లేకుండా మెస్‌లను నిర్వహించాలని త్రిసభ్య కమిటీ సూచించి దాదాపు 8 నెలలైనా నేటికి మెస్ టెండర్లు పిలవకుండా అధికారులు కాలక్షేపం చేస్తున్నారు.

వేసవి సెలవుల అనంతరం జులై ఒకటి నుంచి నూజివీడు ట్రిపుల్ ఐటీలో తరగతులు ప్రారంభమవుతాయి. ఈ లోగా అధికారులు మెస్‌ల నిర్వహణకు టెండర్లు పిలిచి నూతన కేటరర్స్‌ను ఎంపిక చేసి సిద్ధంగా ఉంచాలి. ఇంతవరకు మెస్ టెండర్ల ప్రక్రియనే ప్రారంభించకపోవడంతో మెస్‌ల నిర్వహణపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది సెప్టెంబర్ నెలలో త్రిసభ్య కమిటీలోని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావు, అప్పటి కాలేజీ విద్య కమిషనర్ పోలా భాస్కర్‌లు మెస్‌లు పరిశీలించి అక్టోబర్‌లో టెండర్లు పిలిచి నూతన కేటరర్స్‌ను ఎంపిక చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఇది జరిగి దాదాపు 8 నెలలు గడిచినా ఇంతవరకు ఆ దిశగా అడుగులు పడలేదు. ట్రిపుల్‌ఐటీలో మెస్‌ల నిర్వహణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఎప్పటికి ప్రారంభమవుతుందో అంతుబట్టని విషయంగా తయారైంది.

అప్పటిల్లో 1,100 మందికి ఒక మెస్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుకుంటున్న 6,600 మందికి ఆరు మెస్‌లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అప్పటి చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి 1100 మందికి ఒక మెస్ చొప్పున ఏర్పాటు చేసి టెండర్లు పిలిచి కేటరర్స్‌ను నిర్ణయించారు. ఒక్క సంస్థకే నిర్వహణను ఇస్తే గుత్తాధిపత్యం చేస్తారని చెప్పి ఆరుగురికి ఇచ్చారు. అందరి మధ్య పోటీ ఉండి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తారని అప్పట్లో టెండర్ల ద్వారా నిర్ణయించారు. దీంతో వారందరూ పోటీపడి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించారు.

ఇప్పుడు 6,600 మందికి ఒకే కేటరర్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గతేడాది సెప్టెంబరులో మెస్‌ల నిర్వహణ సరిగా లేదని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని చెప్పి అనూష కేటరర్స్, ఫైన్ కేటరర్స్ కాంట్రాక్టును రద్దు చేసి వారిని బయటకు పంపేశారు. దీంతో 6600 మందికి కేఎంకే కేటరర్ సంస్థ భోజనం అందించేంది. ఇంత పెద్ద మొత్తంలో విద్యార్థులను ఒకే కేటరర్‌కు అప్పగించిన దాఖలాలు ట్రిపుల్ ఐటీ చరిత్రలోనే లేదు. అధికార పార్టీ పెద్దలకు సన్నిహితుడైనందునే విద్యార్థులందరిని ఒక్క కేటరర్‌కే అప్పగించారనే విమర్శలు సైతం అప్పట్లో వచ్చాయి. దీంతో మెస్‌ల నిర్వహణ గుత్తాధిపత్యంగా మారి పెట్టిందే తినాలి అన్నట్లుగా పరిస్థితి తయారైంది. ఆ తరువాత భోజనం నాణ్యత విషయంలో అనేక విమర్శలు సైతం వచ్చినప్పటికీ వేసవి సెలవులు ఇచ్చే వరకు ఆ ఒక్క కేటరరే మెస్‌లు నిర్వహించారు.

నెల రోజుల్లో ఎంపిక చేస్తారా?

ఇంతవరకు టెండర్లను పిలవలేదు. దీంతో మరో నెల రోజుల వరకు కొత్త కేటరర్స్ వచ్చే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. ఎందుకంటే టెండరు పిలిచిన తరువాత బిడ్ వేయడానికి టెండర్ పిలిచిన రోజు నుంచి కనీసం 15 రోజులు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ఫైనాన్స్ బిడ్, టెక్నికల్ బిడ్‌లు పరిశీలించాలి. అనంతరం టెండర్లు ఓపెన్ చేయాలి. దీనంతటికి కనీసం నెల రోజులకు పైగా సమయం పడుతుంది. ఈ పరిస్థితుల్లో వేసవి సెలవులకు ముందు వరకు ఉన్న కేటరరే మెస్‌లు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వారం రోజుల్లో టెండర్లు పిలుస్తాం



ట్రిపుల్ ఐటీ మెస్‌ల నిర్వహణకు టెండర్లను వారం రోజుల్లో పిలుస్తాం. ఈ సారి మెస్‌లకు సంబంధించి నిబంధనలు పకడ్బందీగా రూపొందించి టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తున్నాం. జూలై ఒకటిన తరగతులు ప్రారంభమయ్యేనాటికి కొత్త కేటరర్స్‌ను ఎంపిక చేస్తాం.

ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్,
డైరెక్టర్, నూజివీడు ట్రిపుల్ ఐటీ

వెయిటింగ్ రూం లేక ఇక్కట్లు



నూజివీడు ఏరియా ఆసుపత్రిలో గోడౌన్‌గా వినియోగిస్తున్న విజిటర్స్ వెయిటింగ్ హాల్ షెడ్

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో అసౌకర్యాలతో రోగుల సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. వారు వేచి ఉండటానికి, భోజనాలు చేసేందుకు ఎలాంటి సౌకర్యం లేక ఆసుపత్రి ఆవరణలోని చెట్ల కిందే ఉంటున్నారు. భోజనం చేయాలన్నా చెట్ల కిందే కూర్చుని తినాల్సిన పరిస్థితి. ఆవరణలో రోగులకు సంబంధించిన వారు వేచి ఉండేందుకు వీలుగా గతంలో దాదాపు రూ.15 లక్షలతో రెండు పెద్ద గదులతో షెడ్ నిర్మించారు. ఈ షెడ్‌లో ఆసుపత్రికి సంబంధించిన అనేక రకాలు వస్తువులు వేసి గొడౌన్‌గా వినియోగిస్తున్నారు. దీంతో రాత్రిపూట రోగుల తాలూకా వ్యక్తులు పడుకోవడానికి వీలులేక చెట్ల కిందే బస చేస్తున్నారు. ఇప్పటికైనా షెడ్‌లోని వస్తువులు తొలగించి రోగులకు సహాయకులుగా వచ్చిన వారికి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఘనంగా మద్ది ఆంజనేయస్వామికి కల్యాణం



ఘనంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం గురువాయిగూడెంలో శ్రీ మద్ది ఆంజనేయస్వామికి శుక్రవారం కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. స్వామికి ఉదయం 5.30 గంటలకు ప్రభాత సేవ, నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణల అనంతరం ఆలయ ముఖమండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6 గంటలకు మేళతాళాలు, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అంగరంగవైభవంగా గుర్వాయిగూడెం, చక్రదేవరపల్లి గ్రామాల్లో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం 5.30 గంటల నుంచి ప్రభాత సేవ, నిత్య అర్చన నిత్య హోమం, బలిహరణలు అనంతరం ఉదయం 9 గంటలకు ఉపాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు సాయంకాల హోమాలు నిర్వహిస్తారని ఆలయ ఈవో చందన తెలిపారు.

ఎకో జోన్ ఏర్పాటుపై అవగాహన కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): కొల్లేరు ఎకో జోన్ నిర్ధారణపై గ్రామసభల ద్వారా అందిన విజ్ఞాపనలు పరిశీలించి, సంబంధిత పరిధిలోని ప్రజలకు ఏకో జోన్ ఏర్పాటుపై అవగాహన కల్పించాలని జాయింట్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎకో సెన్సిటివ్ జోన్ నిర్ధారణపై గ్రామ సభల ద్వారా అందిన అభిప్రాయాలపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరు నుంచి 10 కిలోమీటర్ల వరకు ఎకో సెన్సిటివ్ జోన్ నిర్ధారించాల్సి ఉందన్నారు. జోన్ పరిధిలో ఐదు మండలాలలోని 31 గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన గ్రామసభలలోని అర్జీలను పరిశీలించి, ఏకోజోన్ ఏర్పాటుపై వారి సందేహాలను నివృత్తి చేసి తిరిగి అభిప్రాయాలు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీఎఫ్‌ఓ ఆశా కిరణ్, ఏలూరు వైల్డ్ లైఫ్ డీఎఫ్‌ఓ బి.విజయ, ఇంచార్జ్ డీపీఓ వై.దోసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ యశ్వంత్ వర్మపై ఫిర్యాదు

యునైటెడ్ లాయర్స్ ఫ్రంట్ అధ్యక్షుడు జి.రోనాల్డ్ రాజు



ఏలూరు(ఆర్ఆర్‌పేట): అలహాబాద్ హైకోర్టు జడ్జిగా బదిలీ అయిన జస్టిస్ యశ్వంత్ వర్మపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి ఫిర్యాదు లేఖ పంపించినట్టు ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ లాయర్స్ ఫ్రంట్ అధ్యక్షుడు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల హైకోర్టు న్యాయవాది గొట్టుముక్కల రోనాల్డ్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి పదవిలో ఉన్న సమయంలో ఆయన అధికార నివాసంలోని స్టోర్ రూమ్‌లో భారీ స్థాయిలో నోట్ల కట్టలు సగం దగ్ధమై ఉన్న అంశాన్ని లేఖలో ప్రస్తావించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో జస్టిస్ యశ్వంత్ వర్మకు అందుతున్న జీతం, అధికార నివాసం, సిబ్బంది, వైద్య, ఇతర అన్ని సౌకర్యాలు నిలిపివేయాలని ఆ లేఖలో కోరామని పేర్కొన్నారు. ఆయనపై దర్యాప్తు జరపాలని, న్యాయమూర్తి బాధ్యతల నుంచి తొలగించాలని లేఖలో కోరినట్టు తెలిపారు.

పచ్చిరొట్టతో భూమికి సారం



లోపూడిలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి



పచ్చి రొట్ట పంట(ఫైల్)

ముసునూరు: రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గడంతో పాటు.. పర్యావరణ కాలుష్యానికి కారణమవుతోంది. రైతులకు సాగు ఖర్చు పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో నేల ఆరోగ్యం, ఉత్పాదక శక్తి పెంపునకు సేంద్రీయ ఎరువుల వాడకం మంచిదని సూచిస్తున్నారు. పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ కొరతతో రైతులు పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై దృష్టి సారిస్తున్నారు. దీనికి అనుగుణంగానే వ్యవసాయ శాఖ వేసవిలో పచ్చిరొట్ట పంటల విత్తనాలు సబ్సిడీపై అందించి ప్రోత్సహిస్తున్నారు.పచ్చిరొట్ట ఎరువు పంటల్లో జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద, ఉలవ, పెసర, మినుము, అజొల్లా అనుకూలమైనవి.

పచ్చిరొట్ట ఎరువులతో ప్రయోజనాలు

- నేలలో సేంద్రీయ కర్బనం పెరుగుతుంది.
- భౌతిక లక్షణాలైన నేల నిర్మాణం, నేలలోని గాలిని మెరుగుపరుస్తుంది.
- నేలలో ఉండే ప్రయోజనకర సూక్ష్మజీవుల సంఖ్య పెంచుతుంది.
- వేసవిలో సంభవించే భారీ గాలులు, వర్షాల వల్ల నేల కోతను నివారిస్తుంది.
- రసాయనిక ఎరువుల వాడకాన్ని 15 నుంచి 25 శాతం వరకు తగ్గించడంలో సహాయపడతాయి.
- పచ్చిరొట్ట ఎరువులు నేలలో కలియదున్నడం వలన పోషకాల లభ్యతకు సహాయపడతాయి.
- కలుపు మొక్కల నుంచి ప్రధాన పంటకు పోటీని తగ్గించడంలో సహాయపడతాయి.

వేటిని ఎంచుకోవాలి

- తక్కువ నీరు లభ్యమయ్యే పరిస్థితుల్లో పెంచాలి.
- అధిక జీవ పదార్థం ఉత్పత్తి చేసేవి అవసరం.
- మట్టిలో కలసినప్పుడు వేగంగా కుళ్లి పోయేలా ఉండాలి.

ఖరీఫ్ పంటలు వేసే ముందు, ఒకటి, రెండు వర్షాలు కురిసిన తర్వాత పచ్చిరొట్ట ఎరువు పంటల విత్తుకోవాలి. విత్తిన తర్వాత 50 నుంచి 60 రోజుల వరకు ఏపుగా పెంచి, కుళ్లిపోవడానికి నేలలో కలియ దున్నాలి. పళ్లైవు నాగలితో పంటకు 50-60 రోజుల వ్యవధిలో పచ్చిరొట్ట ఎరువు పంటను దున్నడం వలన మట్టిలో బాగా కలిసి పోవడానికి సహాయ పడుతుంది. తర్వాత రోటవేటర్‌ను ఉపయోగిస్తే జీవ పదార్థం వేగంగా కుళ్లిపోతుంది.

పచ్చిరొట్ట ఎరువుతో లాభం



నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను పంటలకు విరివిగా అందించే పచ్చిరొట్ట ఎరువులను వాడి లాభం పొందాలి. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ కొనసాగుతోంది.

– కె.చినసూరిబాబు, మండల వ్యవసాయాధికారి

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



మృతి చెందిన స్ట్రీట్‌లైట్ కాంట్రాక్ట్ కార్మికుడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పురపాలక సంఘంలో స్ట్రీట్ లైట్ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే కార్మికుడు రాపాక అచ్చయ్య (35) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కుంచనపల్లికి చెందిన అచ్చయ్య మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రాంతంలో శుక్రవారం స్ట్రీట్ లైట్ బాగుజేసేందుకు క్రేన్ సాయంతో పైకి ఎక్కాడు. పోల్ వద్ద చెట్ల కొమ్మలు నరుకుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విద్యుత్ సరఫరా నిలిపివేసినప్పటికి రివర్స్ విధానంలో విద్యుత్ రావడంతో కరెంట్ షాక్‌కు గురైనట్లు చెబుతున్నారు. అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న మునిసిపల్ కార్మికుల సంఘం నాయకులు కర్రి నాగేశ్వర రావు, కార్మికులు, బంధువులు, కుంచనపల్లి గ్రామస్తులు అచ్చయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చర్చలు ఫలించకపోవడంతో మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి మునిసిపల్ కార్యాలయం వద్ద తీసుకువచ్చి ధర్నా చేశారు. కమిషనర్ యేసుబాబు, పట్టణ ఎస్సైలు అక్కడికి చేరుకుని కార్మిక సంఘం నాయకులతో, మృతుని కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. చర్చలు ఫలించడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వేసవిలో 44 వీక్లీ రైళ్లు

ఏలూరు (టూటౌన్): వేసవి రద్దీని తట్టుకునేందుకు వీలుగా దక్షిణమధ్య రైల్వే ఆధ్వర్యంలో 44 వేసవి ప్రత్యేక వీక్లీ రైళ్లను నడుపుతున్నట్లు సీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైళ్లు జూన్ 1 నుంచి జూలై 30 మధ్య నడుపనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం-ఎస్ఎంవీటీ బెంగుళూరు(08581) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం, ఎస్ఎంవీటీ బెంగుళూరు-విశాఖపట్నం(08582) ప్రతి సోమవారం, విశాఖపట్నం-తిరుపతి(08547) ప్రతి బుధవారం, తిరుపతి-విశాఖపట్నం(08548) ప్రతి గురువారం, విశాఖపట్నం-చర్లపల్లి(08579) ప్రతి శుక్రవారం, చర్లపల్లి-విశాఖపట్నం(08580) ప్రతి శనివారం నడుస్తుందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కైకలూరు: నాటుతుపాకీలో ఉపయోగించే మందు పేలిన ఘటనలో చికిత్స పొందుతూ శుక్రవారం వ్యక్తి మరణించాడు. రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం ఈ నెల 13న కైకలూరు మండలం రామవరంలో చేపల చెరువులపై పిట్టలను తరమడానికి ఉపయోగించే నాటు తుపాకీలో మందు తయారు చేస్తుండగా పేలింది. ఈ ఘటనలో బాలుడు చరణ్(12)తో పాటు తమిళనాడు రాష్ట్రం, కృష్ణగిరి జిల్లాకు చెందిన మణి సతీష్(36), మణి(26) గాయపడ్డారు. వీరికి కైకలూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కుటుంబ సభ్యులు చెన్నైలో ఆస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్ మరణించాడని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



లారీని వ్యాను ఢీకొన్న దృశ్యం

ఉంగుటూరు : నల్లజర్ల -తాడేపల్లిగూడెం రోడ్డులో లారీని మినీ వ్యాను ఢీకొన్న ప్రమాదంలో.. నల్లజర్ల మండలం సుభద్రపాలెం గ్రామానికి చెందిన చిడిపి సాయిగణేష్ (22) అక్కడికక్కడే మృతిచెందాడు. స్నేహితులు మన్నెల్లి వేణు, పవన్‌తో కలిసి నబీపేటలో క్రైస్తవ మహా సభలకు సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి తిరిగి వస్తుండగా.. ఆగి వున్న లారీని వ్యాను ఢీకొంది. సాయిగణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. వేణు, పవన్‌కు గాయాలయ్యాయి. వారిని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం : స్థానిక వైఎస్సార్ నగర్‌కాలనీకి చెందిన భోగోలు నాగ శరబరాజు(36) తాపీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చలేక మానసికంగా బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి మద్యం సేవించి వచ్చి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై అతని తండ్రి రామచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బాలికలు నైపుణ్యాలను అలవర్చుకోవాలి



మాధవరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలు నాణ్యమైన విద్యతో పాటు చక్కని నైపుణ్యాలను అలవర్చుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మాధవరం అంగన్‌వాడీ కేంద్రం నెం.144లో ఉన్న విద్య నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైపుణ్యాల ద్వారా భావి జీవితంలో ముందుకెళ్లాలన్నారు. డీసీపీయు సోషల్ వర్కర్ పి.జేమ్స్, మహిళా సంరక్షన కార్యదర్శి బి.అరుణాదేవి, అంగన్‌వాడీ సహాయకులు పాల్గొన్నారు.

కృష్ణపరమాత్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో కృష్ణ పరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏకాదశి పురస్కరించుకొని స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శుక్రవారం ఉదయం కృష్ణపరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పుష్పమాలలతో అలంకరించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో యోగా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక వ్యాధులను అధిగమించడానికి యోగా తప్పనిసరి అన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం గంట పాటు యోగా చేయడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు. యోగా శిక్షకుడు కరిబండి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, సోషల్ వెల్ఫేర్ అధికారి రామాంజనేయ రాజు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ, నేవీల్లో తణుకు జెడ్పీ పాఠశాల విద్యార్థులు బెస్ట్



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మావతి

తణుకు అర్బన్: ఎన్‌సీసీ, నేవీ విభాగాల్లో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యున్నత స్థాయి ప్రదర్శన చూపిస్తున్నారని ఆ పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి అన్నారు. ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు నరసాపురం స్వర్ణాంధ్రప్రదేశ్ కళాశాలలో నిర్వహించిన యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో మొదటి స్థానాల్లో నిలిచిన పాఠశాల విద్యార్థులను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ అసోసియేషన్ నేవీ ఆఫీసర్ చీలిరాజును ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సకాలంలో సొమ్ములు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం శ్రామికులకు సకాలంలో సొమ్ములు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం, జగ్గన్నపేట గ్రామాల్లో ఉపాధి పని ప్రాంతాలను సందర్శించి, శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేయడానికి చూస్తుందన్నారు. శ్రామికులకు సొమ్ములు లేకపోవడం ఫీల్డ్ అసిస్టెంట్లకే మూడు, నాలుగు నెలల జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. శ్రామికులకు వేతన బకాయిలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు బకాయి జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ రోడ్లపై నడిచేదెలా?

- రహదారి అంచులపైనే రాకపోకలు
- కొండ్రుప్రోలు కాలనీ వాసుల అవస్థలు
- శశి నుంచి కాలనీకి రహదారిని నిర్మించాలి



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కాలనీకి వెళ్ళే రహదారి బురదమయంగా మారిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు చిత్తడిగా మారాయి. ప్రధానంగా తాడేపల్లిగూడెం పట్టణం నుంచి శశి కళాశాల మీదుగా కొండ్రుప్రోలు కాలనీకి వెళ్లే రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు రోడ్డుపై నిలిచి వాహనాల రాకపోకలతో బురదమయంగా మారింది. టిప్పర్ లారీలు నిత్యం పదుల సంఖ్యలో రావడంతో రహదారి మరింత అధ్వానంగా తయారవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో కొండ్రుప్రోలు కాలనీ ప్రజలు తాడేపల్లిగూడెం పట్టణం వైపు రావాలంటే ఎన్నో అవస్థలను ఎదుర్కొంటున్నారు. బురదమయంగా మారిన రహదారి అంచుల మీదుగానే రాకపోకలు సాగించవలసిన పరిస్థితి వచ్చింది. దీనికి తోడు వాహనాలు రహదారిపై వెళ్లే సమయంలో బురద దుస్తులపై చిందుతుందని పలువురు ప్రజలు వాపోతున్నారు. గణేష్ నగర్ నుంచి శశి కళాశాల వరకు నిర్మించిన రహదారిని కొండ్రుప్రోలు వరకు పొడిగించక పోవడంతో ఈ అవస్థలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించి కొండ్రుప్రోలు కాలనీ వరకు రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించాలని కోరుతున్నారు.



రహదారిపై రాకపోకలు సాగిస్తున్న టిప్పర్ లారీలు



రహదారి బురదమయంగా మారడంతో అంచుల మీదుగా రాకపోకలు సాగిస్తున్న కాలనీవాసులు

మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలి



తణుకులో మద్యం దుకాణం వద్ద ఎక్సైజ్ ఎస్సైలు

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల సమయ పాలన, ఎమ్మార్పీ ధరలకు అమ్మకంతోపాటు అన్ని నిబంధనలు ఖచ్చితంగా అమలు జరిగేలా నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ప్రతిరోజు రాత్రి నిర్దేశించిన సమయానికి మద్యం దుకాణాలు మూసివేసేలా, నిర్ణీత సమయానికి ముందుగా మద్యం దుకాణాలు తెరవకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహణ చేస్తున్నట్లుగా స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి మద్యం దుకాణానికి ఒక కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌లను బాధ్యులను చేశామని, వినియోగదారులకు అందించే మద్యం నాణ్యతను కూడా నిరంతరం పరిశీలించటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నెలకోసారి ప్రతి దుకాణం నుంచి మద్యం బాటిల్‌ను శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించి పరిశీలించడం జరుగుతుందని అన్నారు. మద్యం దుకాణాల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటించే విధంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఏపీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ ఉద్యోగుల సంఘం యూనిట్ కార్యవర్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా యూనిట్ ఎన్నికలు తాడేపల్లిగూడెంలో జరిగాయి. అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్‌రాజు, సీఎస్‌టీఓ టీజే శేషు కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. ఎన్నికల అధికారిగా ఎస్‌కే ఉమర్ ఆలీషా, జిల్లా ఉపాధ్యక్షుడు, సహాయ ఎన్నికల అధికారిగా వై.మోహన్‌రావు, జీవీ రామ నాగులు వ్యవహరించారు. యూనిట్ అధ్యక్షుడిగా ఎన్.ప్రసాద్‌బాబు, కార్యదర్శిగా ఎస్‌వీఎస్ నాగేంద్రకుమార్, కోశాధికారిగా కె.రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎండీ వెంకటేశ్వరరావు, పీఎస్‌వీఎం శివకుమార్, వి.నరసింహమూర్తి, బి.సురేష్, ఎస్ఎస్ఎస్ కృష్ణ, కె.రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిలుగా బి.మేరీ సుహాంత్, కె.రాజ్యలక్ష్మి, పి.సునీత, పి.వెంకట దుర్గ, ఎం.శాంతకుమారి, ఎన్.సౌమ్య, డి.శాంతారావు తదితరులు ఎన్నికయ్యారు.

కనకదుర్గమ్మ ఆలయంలో అన్నదానం

పెంటపాడు: విశ్వావసునామ సంవత్సర వైశాఖమాసం చతుర్ధ శుక్రవారం సందర్భంగా ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదానం ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన ఆళ్ల రవి, బాలదుర్గఅచ్యుతాంబ, పృధ్వీ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సుమారు 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాతులూరి పవన్‌కుమార్ ప్రత్యేక పూజలుచేశారు. కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పైళ్లమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో పైళ్లమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో పైళ్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 8 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా మూడో సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడివీధికి తీసుకొచ్చిన అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. తొలుత గ్రామస్తుల దర్శనాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘటాలకు ప్రత్యేక పూజలు చేసి 4 గ్రూపులుగా గ్రామోత్సవాలు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు అమ్మవారి పూడిగుడి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. 23న జాతర ఉత్సవం సందర్భంగా కేరళ డ్రమ్స్, బెల్లీ నృత్యాలు, తీన్‌మార్ స్టార్‌బాయ్స్, కాళికా డాన్స్, హైదరాబాద్ పోతురాజు టీం నృత్యాలు, సాల్మన్, సిసీ కోబ్రా, గారడీ నృత్యాలు, అలాగే భారీబాణ సంచా కాల్పులు నిర్వహించారు. సుమారు 10 రకాల ఉత్సవ ప్రచార సామగ్రితో అమ్మవారిని ఊరేగించారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గ్రామోత్సవం పురస్కరించుకొని గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి సారె, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. 25న నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అలంపురంలో పందుల స్వైరవిహారం

పట్టించుకోని అధికారులు, పాలకులు



అలంపురం మిడ్‌లెవెల్ కాలువ గట్టు నుంచి సాయిబాబా ఆలయం వద్దకు వెళ్లేదారిలో రోడ్డుపై పందులు

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సుమారు రెండేళ్ల నుంచి ఈ సమస్య ఉంది. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. నిత్యం గ్రామ కార్యదర్శితో పాటు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యసిబ్బంది ఆ దారి గుండానే వెళ్లాలి. అయితే అక్కడే రోడ్డుకు పక్కనే టైర్లు వేసి పందులకు మేత తినిపిస్తున్నారు. ఆ ప్రాంతం నిత్యం దుర్వాసనతో వెదజల్లుతోంది. అలంపురం- ప్రత్తిపాడు వెళ్లేందుకు వీలుగా ఉన్న వంతెనపై నిత్యం చేపలు అమ్మి, అక్కడే మిడ్‌లెవెల్ కాలువలో వ్యర్థాలు సంచులతో పడేస్తున్నారు. దుర్వాసన వస్తున్నా పంచాయతీ సిబ్బంది కనీసం చర్యలు చేపట్టక పోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బేగ్‌ను వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రశాంతంగా ముగిసిన ఈఏపీసెట్ పరీక్ష

తాడేపల్లిగూడెం: ఏపీఈఏపీసెట్ పరీక్షలు శశి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టులలో శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మొదటిషిఫ్టులో 227 మందికి గాను 222 మంది హాజరయ్యారు. రెండవ షిఫ్టులో 227 మందిగి గాను 225 మంది హాజరయ్యారు. పీడబ్ల్యూడీ అభ్యర్థులు, స్క్రైబ్ అవసరమున్నవారు లేక పోవడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. విజయవంతంగా పరీక్షలు నిర్వహించిన సిబ్బందికి యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

ఇకపై ప్రతిరోజూ డ్రైడేగా పాటించాలి



తణుకులో ర్యాలీ నిర్వహిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు



పట్టణంలో ఆరోగ్య అవగాహన ర్యాలీ

తణుకు అర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇకపై ప్రజలంతా ఇకపై ప్రతిరోజూ డ్రైడేగా పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని జంగం చెర్వు అంగన్‌వాడీ సెంటర్, గణేష్ చౌక్ సమీపంలోని మసీదు ఏరియాలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎన్జీవో కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.పృధ్వీరాజ్ నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యన్నారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.బేబీ కుమారి, బి.శిరీష, వార్డు ఉమన్ ప్రొటెక్షన్ సెక్రెటరీ ఎండి.హర్ష బేగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.అరుణ కుమారి, అంగన్‌వాడీ టీచర్ వి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ హెల్పర్ ఎండీ థౌలా, ఆశా కార్యకర్త ఇ.లలిత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని, సమష్టి కృషితో కీటక జనిత ప్రదేశాలను నిలువరించి దోమల వ్యాప్తిని అరికడదామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణ రావు అన్నారు. పట్టణంలోని శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు జరిగాయి. పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలో 33, 34, 35 వార్డులలో వెక్టార్ కంట్రోల్ హైజీన్, పరిసరాల పరిశుభ్రత, క్షేత్ర స్థాయి పరిశీలనలు, ర్యాలీలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కరపత్రాలను పంచారు. ఆరోగ్య కార్యదర్శి రాజేశ్వరీ, దుర్గాదేవి, చిన్నపాప, ఆశా వర్కర్లు లక్ష్మీ, దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి వరాల వెంకటేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు

అత్తిలి: బుల్లి తిరుపతిగా పేరుగాంచిన ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు జూన్ 4 నుంచి ప్రారంభంకానున్నాయి. జూన్ 4న ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం వరాల వెంకటేశ్వరస్వామిని పెండ్లి కుమారునిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేస్తారు. రాత్రి అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, వాస్తుహోమ పూజలు నిర్వహిస్తారు. 5వ తేదీన హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం పెన్మెత్స లక్ష్మీనరశింహరాజు, రామసత్యవతి దంపతులచే సమర్పించిన గజవాహనంపై గజవాహన సేవ, అల్లూరి సీతారామరాజు, మీనాక్షి దంపతులచే వైఖానస ఆగమం ప్రకారం వాడపల్లి శేఖరాచార్యులు, విభన్‌బాబు పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం జరుగుతుంది. 6వ తేదీన తీర్థ మహోత్సవం, అన్నసమారాధన, రథోత్సవం కార్యక్రమాలు, 7న సింహవాహన సేవ, 8న సుదర్శన హోమం, గరుడవాహన సేవ, 9న శేషవాహన సేవ, 10న చక్రస్నాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల వెంకట నారాయణ, ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్, ఆశ్రమ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పాలూరి నాగ బలుసులరావు సౌజన్యంతో శుక్రవారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, కంటి వైద్య పరీక్షలు, ఆర్థోపెడిక్, స్త్రీ, ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధులు, రేడియాలజీ తదితర విభాగాలలో వైద్య పరీక్షలు జరిగాయి. 230 మంది శిబిరంలో పాల్గొన్నారు. అవసరమైన ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు, క్లబ్ అధ్యక్షుడు గట్టిం ప్రవీణ్ కృష్ణ, సభ్యులు పాండురంగారావు, పిల్లా వెంకన్నబాబు, కాకర్ల శ్రీనివాస్, కేవీ రామారావు, కరిబండి రామకృష్ణ, వర్తనపల్లి కాశీ పాల్గొన్నారు.

26న ఏలూరులో రజక జన మహాసభ

తాడేపల్లిగూడెం రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన మహాసభ ఈ నెల 26న ఏలూరు జన్మభూమి పార్కు ఎదురుగా ఉన్న జిల్లా రజక సంఘ భవనంలో జరుగుతుందని, ఈ సభను జయప్రదం చేయాలని జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రజకుల చెరువులను వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏలూరులో జరగనున్న సభను జయప్రదం చేయాలన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు



పుష్కరయాత్రకు తరలివెళ్తున్న స్పెషల్ బస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సరస్వతి నది పుష్కరాలకు తాడేపల్లిగూడెం నుంచి శుక్రవారం రాత్రి ప్రత్యేక బస్సు బయలు దేరుతున్నట్లు డిపో మేనేజర్ ఏలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ బస్సు ఉదయం వరంగల్ చేరుకుంటుందని, సమీపంలోని ఆరు ఆలయాలను దర్శించుకొని కాళేశ్వరంలోని పవిత్ర పుణ్యస్నానం ఆచరిస్తారని, తిరిగి 26వ తేదీ సోమవారం తెల్లవారుజామున తాడేపల్లిగూడెం చేరుకుంటుందన్నారు.

'గూడెం'లో 19.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడిచిన 24 గంటల్లో 19.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 28.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

చల్లాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలోని చల్లాలమ్మ వారి ఆలయంలో శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ధూళిపాళ పవన్ కుమార్ బ్రహ్మత్వంలో కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు విరివిగా పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి



యుపీఏ చైర్మన్ జ్యోతి ఆనంద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విశ్వాసులు క్రీస్తు మార్గంలో పయనించాలని యుపీఏ తాడేపల్లిగూడెం చైర్మన్ జ్యోతి ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపాలెం అపోస్తలు చర్చిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అన్న క్రీస్తు సూక్తులను విశ్వాసులు అనుసరించాలన్నారు. అనంతరం జ్యోతి ఆనంద్, సుస్మిత, చర్చి నిర్వాహకులు సామ్యూల్ పాల్, హెప్సిబాలను విశ్వాసులు సత్కరించారు.


వర్షాలు పడుతుంటే పూడికతీత పనులా?

- అస్తవ్యస్తంగా వేల్పూరు రోడ్డు
- దుర్గంధం.. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం
- వ్యాపారాలు పోయాయంటున్న వ్యాపారస్తులు




తణుకు వేల్పూరు రోడ్డులో మురుగును దాటేందుకు చేస్తున్న ఫీట్లు

తణుకు అర్బన్: తణుకు వేల్పూరు రోడ్డులోని డ్రెయినేజీల్లో మునిసిపల్ అధికారులు చేపట్టిన పూడికతీత పనులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కాలమే అయినప్పటికీ వర్షాలు పడుతున్న రోజుల్లో ప్రధాన డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేయడమేంటని నిలదీస్తున్నారు. గత వారం రోజులుగా ప్రతి రోజూ ఏదోక సమయంలో వర్షం వస్తున్న విషయం అందరికీ తెలిసిందే. తణుకు కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డులో వర్షం వస్తున్నా పూడికతీత పనులు నిర్వహిస్తున్నారంటూ దుకాణదారులు, నివాసితులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పూడికతీత పనులు చేయడం మంచిదేకానీ వర్షాలు పడుతున్న సమయంలో డ్రెయినేజీలోని మురుగును రోడ్డుపైనే వేయడంతో వర్షపునీటికి రోడ్డంతా కమ్మేయడం, తీసిన మురుగు తిరిగి డ్రెయినేజీల్లోకి వెళ్తుండడం వలన పని దండగ అని వాపోతున్నారు. అంతేకాకుండా ఈ రహదారులు గత మూడు రోజులుగా మురికి కూపాలుగా మారిపోయాయని ఇళ్లలోకి, దుకాణాల్లో వెళ్లలేకపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న రోడ్లలోకి వెళ్లలేని స్థితిలో మురుగు పేరుకుపోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు పడే సమయంలో పూడికతీత పనులు నిలిపివేయాలని ప్రజానీకం కోరుతున్నారు. మురుగు రోడ్లపై పోగుగా పెట్టడంతో వర్షం కారణంగా అంతా కలిసిపోయి దుకాణాల్లోకి వచ్చే మార్గం కూడా లేకపోయిందంటూ వ్యాపారులు వాపోతున్నారు.



తణుకు వేల్పూరు రోడ్డు నుంచి తాడి వారి వీధిలోకి వెళ్లే మార్గం దుస్థితి



తణుకు కప్పలవెంకన్న సెంటర్ నుంచి రూట్స్ స్కూల్ రోడ్డులోకి వెళ్లే రోడ్డు దుస్థితి



తణుకు తిప్పాని వారి వీధికి వెళ్లే మార్గంలో అడ్డంగా మురుగు తిష్ట